క్లుప్తంగా

గరుడ వాహనంపై కేశవస్వామి



పందలపాకలో స్వామివారి గ్రామోత్సవం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి గ్రామోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం అనంతరం అర్చకులు కేశవచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని గరుడ వాహనంలో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి దర్శించుకున్నారు.

నేడు దివిజ కవితా సంకలనం ఆవిష్కరణ

అనపర్తి: కవితా వ్యాసాంగంలో కృషి చేస్తున్న గ్రామానికి చెందిన చాగంటి సుబ్రహ్మణ్యం రచించిన దివిజ కవితా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సాహితీ గోదావరి పత్రిక సంపాదకులు డాక్టర్ ర్యాలీ శ్రీనివాస్ పాల్గొని దివిజ కవితా సంకలనం ఆవిష్కరిస్తారని తెలిపారు.

నేడు మెగా వైద్య శిబిరం

పెదపూడి: జి.మామిడాడలో నల్లమిల్లి వెంకటరెడ్డి భాస్కరలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆ ట్రస్ట్ చైర్మన్, రోటరీ క్లబ్ ఫౌండర్ నల్లమిల్లి బుచ్చిరెడ్డి తెలిపారు. శనివారం పెదపూడిలో ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ నిర్వహిస్తారన్నారు. శిబిరంలో కంటి, చర్మ, షుగర్, థైరాయిడ్, చెవి, ముక్కు గొంతు, గుండె, కిడ్నీ, ఎముకలు, చిన్న పిల్లల, నరాలు, ప్రసూతి, దంత, జీర్ణకోశం, లివర్ మొదలగు వ్యాధులు సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. జి.మామిడాడ గ్రామ పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సీతానగరం: ముగ్గళ్ల ఎస్సీ పేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ కె.రమేష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్నలకు జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు మట్టాడి వెంకటరమణ వినతిపత్రం అందజేశారు. శనివారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో వారిని కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల నుంచి పంచాయతీ కుళాయిల నుంచి నీరు రావడం లేదన్నారు. దళితవాడలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు స్పందించకపోతే ఉద్యమిస్తామని అన్నారు. అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మదుగులమ్మ జాతర



మదుగులమ్మ అమ్మవారు

బిక్కవోలు: స్థానిక మదుగులమ్మ తల్లి అమ్మవారి జాతర వైభవరంగా నిర్వహించారు. శనివారం ఆలయం అమ్మవారి ప్రత్యేక పూజలు అనంతరం గరగ నృత్యాలతో, తీన్మార్, బ్యాండ్ మేళాలు, బాణసంచా వెలుగులో జాగరణ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారి తీర్థం జరగనుందని ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, బిక్కవోలు లక్ష్మీ గణపతి ఆలయం కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో స్కిల్ హబ్

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి రాజానగరంలో స్కిల్ హబ్‌ను ప్రారంభించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న 'కామన్ ప్రొడక్షన్ సెంటర్' భవనంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి, నిరుద్యోగులైన యువతకు 'డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్' కోర్సులో అవసరమైన శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్ ఆపై విద్యార్హత ఉండి 18 – 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఇతర వివరాలకు 83285 07473 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

సారా విక్రేత అరెస్టు

అనపర్తి: పీరారామచంద్రపురంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. పీరారామచంద్రపురం గ్రామ పరిధిలో సారా విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో సిబ్బందితో వెళ్లగా గ్రామ శివారులో సారా విక్రయిస్తున్న తీగిరెడ్డి శ్రీనుని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి, నిందితుడిని రిమాండ్‌కు విధించినట్టు ఎస్సై తెలిపారు.

మానవతే స్ఫూర్తి.. సేవే దీప్తి

- 'సేవా ఉగాది' పేరుతో దాతృత్వం
- దివాన్‌చెరువులో యువకుల ఉదారత

రాజానగరం: ఆకలి కష్టాలు తెలుసుకుని.. ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. మనసున్న మారాజులు, మీకెవ్వరూ సాటిరారని నిరూపిస్తున్నారు.. రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన మహా గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో 2016లో 'సేవా ఉగాది' పేరిట స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించారు. ఆ గ్రామంలోని సాధుపేటలో సంఘ సభ్యులు తొలుత తమ పాకెట్ మనీనే నిధిగా చేసుకుని సేవలకు శ్రీకారం చుట్టారు. ఆకలితో అలమటిస్తున్న బిచ్చగాళ్లు, దయనీయ స్థితిలో ఉన్న పేదల ఆకలి తీర్చేవారు. అంచెలంచెలుగా దాతల సహాయ, సహకారాలతో తమ సేవలను విస్తరించారు. మలికిపురంలో 'సేవా సంక్రాంతి' పేరిట అందిస్తున్న సేవలను చూసి చైతన్యం పొందిన ఆ యువకులు తాము కూడా అవకాశం ఉన్నంత వరకూ సమాజానికి సేవ చేయాలనే తలంపుతో ముందడుగు వేశారు. ఉద్యోగ రీత్యా దివాన్‌చెరువులోనే ఉంటున్న నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తలారి వాసు సలహాలు, సూచనలు తీసుకుని ఉగాది రోజున 'సేవా ఉగాది' పేరుతో వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో ఉగాది రోజునే సేవలందించే వీరు క్రమేణా ఏడాది పొడవునా దాతృత్వ పరిమళాలు విరాజిల్లుతున్నారు. నీలపాల శ్రీనివాసరావు, దేశాల దుర్గా అచ్చారావు, కడియం శ్రీను, గ్రంధి గణేష్‌గుప్తాతో పాటు మరో 20 మంది సభ్యులు కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వహిస్తున్నారు. ముఖ్యమైన పండుగలు, సెలవు రోజుల్లో దాతల ద్వారా సమకూరిన విరాళాల మేరకు దివాన్‌చెరువు పరిసర గ్రామాల్లో సేవా చైతన్య యాత్రలు నిర్వహిస్తూ పేదలకు ఇంటింటికీ వెళ్లి, రెండు నెలలకు సరిపడా కిరాణా సామగ్రితో కిట్లు అందజేస్తున్నారు. చలికాలంలో వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, దుస్తులు, వర్షాకాలంలో గొడుగులు పంపిణీ చేస్తున్నారు. వేసవిలో దివాన్‌చెరువు కూడలిలో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ తమ సేవలు విస్తరిస్తున్నారు.



పేదలకు దుస్తులు, నిత్యావసరాల కిట్లు అందజేస్తున్న సేవా ఉగాది సభ్యులు (ఫైల్)



దివాన్‌చెరువులో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ

కష్టకాలం.. ఆదుకున్న దాతృత్వం

కరోనాతో రెండేళ్ల పాటు నెలకొన్న స్తబ్దత కాలంలోనూ సేవ ఉగాది ద్వారా సేవలు ఆగలేదు. అన్నార్తుల ఆకలిని తీర్చే విధంగా వలస కార్మికులు, బాటసారులు, సైకిళ్లు, లారీలపై ప్రయాణించే వారికి భోజనం, వాటర్ ప్యాకెట్లను సుమారు 3,500 మందికి ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థులకు 2021లో వంద మందికి, 2022లో 140 మందికి ఉపకార వేతనాలుగా అందజేశారు. పాఠశాలల విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు ఇస్తున్నారు. 'సేవ ఉగాది' సభ్యులు ఆధ్యాత్మిక పరంగానూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దివాన్‌చెరువు సాధుపేటలో వినాయకుడి మందిరాన్ని ఏర్పాటు చేసి, గణపతి నవరాత్రులు నిర్వహించి ఆఖరి రోజు అన్న సమారాధన చేస్తున్నారు. వివిధ పండుగల ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తున్నారు. ప్రస్తుతం ప్రజలను చైతన్యపరుస్తూ దివాన్‌చెరువులో నెల రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

సేవలు అనిర్వచనీయం



ఇక్కడి యువకులు సేవ చేయాలనే తలంపుతో ముందుకు రావడం ప్రశంసనీయం. మలికిపురంలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో ఇంటర్ విద్యార్థులు సంక్రాంతి పండుగకు పేదలకు సాయం అందించారు. వారి ఆలోచన బాగుండడంతో 2006లో 'సేవ సంక్రాంతి' పేరిట సేవలను కొనసాగించాలని సలహా ఇచ్చాను. అలాగే దివాన్‌చెరువులో యువకులూ సేవా భావాన్ని వ్యక్తపర్చడంతో 'సేవ ఉగాది' ఏర్పాటైంది.

– డాక్టర్ తలారి వాసు, తెలుగు అధ్యాపకుడు, నన్నయ యూనివర్సిటీ

మరికొందరికి ఆదర్శం



సమాజం మనకేమి చేసిందని కాకుండా మనమేమి చేశామనుకునే భావంతో 'సేవ ఉగాది' పేరిట దివాన్‌చెరువులోని కొంతమంది యువకులు పేదలకు సేవలందించడం అభినందనీయం. అప్పుడప్పుడు ఈ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా మాకూ అవకాశం కల్పించడం హర్షణీయం. వీరి సేవాతత్పరత మరికొందరికి ఆదర్శంగా నిలుస్తోంది.

– డాక్టర్ కేవీవీ రామసుబ్రహ్మణ్యం, దివాన్‌చెరువు

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ భరత్‌రామ్

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని ఆదిత్య స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ హాజరయ్యారు. ముందుగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఆదిత్య సంస్థలు అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ఆదర్శనీయుడని కొనియాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. నాడు–నేడు పథకంలో ఎన్నో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అబాకస్ విధానంలో ఉపాధ్యాయులు అడిగిన పలు ప్రశ్నలకు వెంటనే సమాధానాలు చెప్పి అందరిని ఆశ్చర్యపరిచారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, సర్పంచి లంక మున్ని, ఆదిత్య సంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ వి.రాజేష్, వైఎస్ ప్రిన్సిపాల్ భవానీ, వైస్ ఎంపీపీ ద్వారంపూడి వెంకటరెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభితం.. నారసింహుని క్షేత్రం



నారసింహస్వామికి గరుడ వాహనోత్సవం

గరుడ వాహనంపై ఊరేగిన స్వామివారు

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు ప్రత్యేక పూజలు జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 9 గంటలకు అన్నవరం సత్యనారాయణ దేవస్థానం ఆధ్వర్యంలో స్వామికి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి మాఢవీధుల నుంచి తిరుగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలాఉంటే ఉదయం ఆరాధన, సర్వదర్శనం, గ్రామ బలిహరణ, సేవాకాలం, తీర్థప్రసాద గోష్ఠి జరిగింది. రాత్రి 8 గంటలకు గ్రామ బలిహరణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా కోరుకొండ భక్తులతో కిక్కిరిసింది. కొండపైకెక్కిన భక్తులు స్వామిని దర్శించుకుని తన్మయం చెందారు. దేవుని కోనేటిలో స్నానమాచరించిన భక్తులు కొండపైకి ఎక్కి మొక్కులు తీర్చుకున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. పంచాయతీ రాజ్, మండల పరిషత్ శాఖలకు చెందిన అధికారులు పురవీధుల్లో పారిశుద్ధ్యంపై దృష్టిసారించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మండపంలో రాజమహేంద్రవరానికి చెందిన వైక్షీరసాగరిక భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ ఎస్వీ రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం ట్రస్టు సభ్యులు తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు, పి.వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో వైష్ణవ మహిళ మృతి చెందడంతో దర్శనాలను రెండు గంటలపాటు నిలిపివేశారు.

నేడు సదస్యం

నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం సదస్యం జరుగుతుంది. స్వామివారి ఆలయ ముఖ మండపంలో వేదపండితులు, ఉభయ వేదాంత పండితుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు ఆంజనేయ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఉంటుంది.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న పతంజలి డీజీఎం రమణ

రాజానగరం: తోకాడలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు సర్పంచ్ చక్రధరరావు అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఉద్యాన శాఖ, పతంజలి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు ఏవిధంగా సాధించవచ్చో వివరించారు. డ్రిప్ ఇరిగేషన్‌తో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో పతంజలి డీజీఎం రమణ, వీహెచ్ఏలు ప్రసన్న, జ్యోతి, క్లస్టర్ ఇన్‌చార్జి, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జనార్దనుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి వారు

అనపర్తి: స్థానిక పాతవూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి వార్షిక కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్రానుసారంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. శనివారం పూజలు, హోమాలు జరిపించారు. ఈ నెల 5న సదస్యం, 7న ఉదయం శ్రీచక్రస్నానం, పూర్ణాహుతి, 8న ఊంజల్‌సేవ, పుష్పాలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.

పెదపూడి: గ్రామంలోని జనార్దన స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకుడు పెద్దింటి వెంకటగోపాలచార్యులు ఆధ్వర్యంలో పండితులు కల్యాణ క్రతువులు నిర్వహించారు. ఆలయ ఈవో వడ్డాది సత్యనారాయణ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. ఆలయ ధర్మ కర్త కుసునురు విశ్వనాథ్, పద్మావతి దంపతులు యజ్ఞకర్తలుగా పాల్గొన్నారు. గండ్రేడు గ్రామంలో ఉమా సోమేశ్వరస్వామి వారి ఆలయంలో దివ్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ బి.శ్రీనివాస్, వేదపండితులు మిక్కిలి దుర్గయ్య శాస్త్రీ, ఆలయ చైర్మన్ కె.వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పని దినాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాతున్న ఎంపీడీవో జేఏ ఝాన్సీ

బిక్కవోలు: లక్ష్యం మేరకు కూలీలకు పని దినాలు కల్పించాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2022–2023 వార్షిక ఏడాది 03,50,000 పనిదినాలు లక్ష్యం ఇచ్చారన్నారు. ఇప్పటికీ 3,10,000 పనిదినాలు పూర్తి చేసినట్టు తెలిపారు. ఇంకా 27 రోజులు సమయం ఉందని గడవు ముగిస్తే సమయానికి లక్ష్యం చేరుకోవాలన్నారు. బలభద్రపురం, తొస్సిపూడి, ఇలపల్లి గ్రామంలోని పని దినాలు కల్పించడంలో వెనుకబడి ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది లక్ష్యాని దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని ఉపాధి హామీ ఏపీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గట్టుపై సాగు.. ఆదాయం బాగు

రంగంపేట: మెట్టప్రాంతంలో రైతులు పొలాల గట్లపై, రోడ్డు పక్కన పలు రకాల అపరాలు, కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తూ అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. సాధారణంగా గట్లను, ఖాళీగా ఉండే స్థలాలను శుభ్రం చేయకపోతే పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉంటాయి. పరిసరాలు శుభ్రతలే కపోతే పంటలకు చీడపీడలు ఆశించే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితులను అధిగమించడానికి మండల పరిధిలోని చంద్రేడు, పెదరాయవరం, రంగంపేట, వడిశలేరు గ్రామాల్లోని నల్లరేగడి, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, జి.దొంతమూరు తదితర గ్రామాల్లో ఎర్రరేగడి నేలల్లో వ్యవసాయం చేసే రైతులు పొలాల వెంబడి రోడ్డుకు ఇరువైపులా, గట్లపైనా, ఖాళీ స్థలాల్లో కంది, మినుము, జనుము, అరటి, మిరప, బెండ తదితర రకాలు మొక్కలు పెంచుతున్నారు. ఇలా వేసిన మొక్కలు ఎటువంటి ఎరువులు, రసాయనాలు వేయకుండానే ఏపుగా ఎదుగుతున్నాయి. తమ పంట పొలాలకు నీరు పెట్టినప్పుడే ఈ మొక్కలకు కూడా తడిని అందిస్తున్నారు. ఇలా ఖాళీ ప్రదేశాలను వదిలేయకుండా పలు రకాల మొక్కలను పెంచడం ద్వారా కుటుంబ అవసరాలు తీర్చడంతో పాటు, చిరు వ్యాపారులకు అమ్మి అదనపు ఆదాయం పొందుతున్నారు. పొలాల పరిశరాలు శుభ్రంగా ఉంటే చేలల్లో పంటలకు తెగుళ్ల బెడద తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.



పొలాల్లో రోడ్ల వెంబడి సాగు చేస్తున్న కంది



రోడ్లకు పొలాల మధ్య ఖాళీ స్థలంలో వేసిన మినుము

'నన్నయ'లో మేనేజ్‌మెంట్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ అశోక్ తదితరులు

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'వాణిజ్యం, నిర్వహణ, మానవీయ శాస్త్ర పరిశోధన పద్ధతి' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. దీనిని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలతో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ఎక్కువ అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ ఆచార్య బి.రాజశేఖర్ మాట్లాడుతూ పరిశోధన అనేది మానవ అనుభవంలో అతి ముఖ్యమైందన్నారు. సాంఘిక శాస్త్ర పరిశోధన సమాజంలో సామాజిక సంఘటనలను వెలికితీయడానికి తోడ్పడుతుందన్నారు. అనంతరం పరిశోధక విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కన్వీనర్లుగా డాక్టర్ ఎన్.ఉదయ్‌భాస్కర్, పి.ఉమామహేశ్వరిదేవి, ఎం.రమేష్, జె.రవిశంకర్, ఐఎస్ఎస్ రాజు, రాజేంద్రప్రసాద్, ఎస్.శ్రావ్య వ్యవహరించారు.

అక్రమ లేఅవుట్‌లో సరిహద్దు రాళ్ల తొలగింపు



రాళ్లను తొలగిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

గోకవరం: గ్రామ శివారున కోట్నిస్ ఆస్పత్రి సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్‌లో సరిహద్దు రాళ్లను శనివారం పంచాయతీ అధికారులు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి లేఅవుట్‌లో ఉన్న రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్‌ను వేయడంతో పంచాయతీ ఆధ్వర్యంలో రాళ్లను తొలగించామన్నారు. పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

మధురపూడి/రాజానగరం: దేశంలో మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కోరుకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మండల, జిల్లా స్థాయిలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి, న్యాయపరమైన సలహాలను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీవీఎస్ కుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.మానస, డీఆర్‌డీఏ ఏపీడీ ఇ.శ్యామసుందర్, ప్యానల్ అడ్వకేట్ డి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



బలభద్రపురంలో ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, నాయకులు

బిక్కవోలు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చని సర్పంచ్ బుంగా రామారావు అన్నారు. శనివారం బలభద్రపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఎంటీ (మాస్టర్ ట్రైనర్) స్వర్ణలత మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ ద్వారా పండించే ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. రబీ సీజన్‌కు ఐదు లేదా ఆరు రోజులు ముందే 30 రకాలు చిరుధ్యానాలు విత్తనాలు చల్లుకోవడం వల్ల భూ సార పెరగడంతో పాటు రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ మేడపాటి ఆనందరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది. గణేష్‌బాబు, కొక్కిరి మెట్ట పుల్లయ్య కాపు, ఐసీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న సత్యనారాయణ

సీతానగరం: మండలంలోని రాపాక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం చినకొండేపూడి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ తన బైక్‌పై రాజమహేంద్రవరం వెళ్తుండగా, రాపాక రైస్‌మిల్లు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. అతని తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మరో బైక్‌పై ఉన్న సీతానగరం పంచాయతీ పరిధి వెలమపేటకు చెందిన వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.